క్లుప్తంగా

గ్రంథాలయంలో భోజనం వసతి



భోజనం వడ్డిస్తున్న బీఎస్పీ నాయకులు

కోదాడ : కోదాడ శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు బహుజన సమాజ్ పార్టీ ఎక్జిక్యూటివ్ మెంబర్ పిల్లుట్ల శ్రీనివాస్ ప్రతిరోజు మధ్యాహ్నం ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షలు పూర్తయ్యేవరకు నిరుద్యోగులకు భోజన వసతి కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం గ్రంథాలయానికి స్టడీ చైర్స్, ప్యాడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంది తిరపతయ్య, కళ్యాణ్, నూకల గోపాలస్వామి, రవి, సోమయ్య, మహేష్, సైమన్, శ్రీహరి, బాలు, విజయ్, కిశోర్, బుద్దయ్య, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

16న పెన్షన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్

కోదాడఅర్బన్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఏప్రిల్ 16న నిర్వహించే పెన్షన్ కాన్‌స్టిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్వీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ ర్యాలీలో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి సీపీఎస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం డివిజన్ నాయకులు అంకులయ్య, కరుణాకర్, ముక్తార్, సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు



యాతవాకిల్లలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్పంచ్

మఠంపల్లి : మండలంలోని యాతవాకిల్లలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు గతంలో స్థానికంగా కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని శనివారం మఠంపల్లి తహసీల్దార్ సాయాగౌడ్, సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహ రాజులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు త్వరలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్ఐ సుజిత్‌కుమార్, సర్వేయర్ గోవిందరెడ్డి, నరసయ్య, తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన తురక సైదులు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో అతనికి రూ.4 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కోదాడ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి సురేష్, నాయకులు పసుపులేటి మనోజ్‌కుమార్, కలకోట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రూట్స్ మర్చంట్ యూనియన్ ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బీఆర్‌టీయూ అనుబంధ సంఘం అయినా ఫ్రూట్స్ మర్చంట్ యూనియన్ సభ్యుడు వెంకటప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబసభ్యులకు యూనియన్ తరఫున రూ.15 వేలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉపేందర్, నాగేందర్, వెంకటేశ్వర్లు, ఉస్మాన్, కృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సర్జరీకి సాయం..

హుజూర్‌నగర్‌కు చెందిన చక్రాల బొబ్బేష్ –ప్రియాంక కూతురు మహంతికి హైదరాబాద్‌లో గుండెకు సర్జరీ చేయించేందుకు డాక్టర్ రావూరు శివప్రసాద్ రూ.10 వేలు అందజేశారు. కుటుంబసభ్యులు డాక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : హాత్‌సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం మండలంలోని ఆకుపాములలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విలాకసకవి రామరాజు, వెంకటేశ్వర్లు, రామరాజు యాదవ్, జిల్లేపల్లి గోపి, పోలంపల్లి వీరబాబు, కేశగాని సీతయ్య, పోలంపల్లి వీరయ్య, తాళ్లపాక శ్రీను, సతీష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో నీటి కటకట



నయానగర్‌లో మున్సిపల్ ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

- పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్
- వారం రోజులుగా సరఫరా బంద్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కోదాడ : కోదాడలో నీటి కటకట ఏర్పడింది. కోదాడ పట్టణానికి తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలడంతో వారం రోజులుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రజల కనీస అవసరాలకు కూడా నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు గతంలోని బావులు, బోర్ల ద్వారా కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తున్నారు. అయినా పట్టణవాసుల అవసరాలకు నీరు సరిపోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

తరచూ మరమ్మతులే..

కాగా కోదాడ పట్టణానికి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ వారం రోజుల క్రితం మునగాల సమీపంలో పగిలిపోయింది. అయితే పైప్ లైన్ పంటపొలాల్లో పగిలిపోవడంతో పాటు సదరు పైప్‌లైన్ మరమ్మతుల నిర్వహణ ఏజెన్సీ మాత్రమే చేయాల్సి ఉంది. అయితే పైప్‌లైన్ మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ ఏజెన్సీ వారు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఈ పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో గతంలో కూడా పలుమార్లు రెండు మూడు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విడత వారం రోజులు దాటుతున్న మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

అద్దె ట్యాంకర్లతో..

అయితే పట్టణంలో 80 శాతం ప్రాంతాలకు రోజువిడిచి రోజు లేదా రెండు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. కాగా వారం రోజులుగా నీరు రాకపోవడంతో మున్సిపల్ అధికారులు గతంలో ఉన్న బావులు, బోర్‌మోటార్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో పాటు 8 నీటి ట్యాంకర్లను అద్దెకు తీసుకొని అవసరమున్న ప్రాంతాలకు నీటిని పంపిస్తున్నారు. ఈ ఏర్పాట్లు ఏమాత్రం సరిపోవడం లేదు. మరోపక్క రంజాన్ మాసం కావడంతో నీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, నాలుగు రోజులకు ఒకసారి కూడా ట్యాంకర్ రావడం లేదని పలు వార్డులలో ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.

రెండు రోజుల్లో సమస్య పరిష్కారం



పట్టణానికి తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ మునగాల సమీపంలో పగిలిపోయింది. ఏజెన్సీ వారు మరమ్మతులు చేపడుతున్నారు. మరో రెండు రోజులు పడుతుందని చెప్పారు. అప్పటి వరకు ఇబ్బంది లేకుండా 8 ట్యాంకర్లను అద్దెకు తీసుకొని నీటిని సరఫరా చేస్తున్నాం. పాత తాగునీటి పథకాల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తున్నాం.

– మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్

మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : మిల్లర్లు తరుగు పేరుతో రైతుల్ని ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో యాసంగి కొనుగోళ్లపై రైస్ మిల్లుల యజమానులు, అధికారులు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటను మిల్లర్లు నిబద్ధతతో కొనుగోలు చేయాలన్నారు. గిట్టుబాటు ధర విషయంలో ఎటువంటి కొర్రీలు పెట్టొద్దని, రైతుల్ని ఎవరు ఇబ్బంది పెట్టినా వారిపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతిగింజనూ మిల్లర్లు కొనుగోలు చేయాల్సిందేనని, గ్రేడ్ల పేరుతో ధరల్లో వ్యత్యాసం చూపవద్దని, సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్ పర్సన్ దొంతగాని లక్ష్మమ్మ, వైస్ చైర్మన్ ముడెం రామలింగారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, ఉన్నతశ్రేణి కార్యదర్శి కె.సంగయ్య, సీఐ రామలింగారెడ్డి, తహసీల్దార్‌ల్ల జయశ్రీ, సరిత, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, ఎస్ శ్రీనివాస్, గెల్లి అప్పారావు, దొంగరి వెంకటేశ్వర్లు, ఎం.వెంకట నారాయణ, కోటేశ్వరరావు, అనీల్, ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులకు స్థలం సేకరించాలి

హుజూర్‌నగర్ : మేళ్లచెరువు, చింతలపాలెంలలో సబ్ మార్కెట్ యార్డుల నిర్మాణానికి స్థలం సేకరించాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సూచించారు. శనివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆ మార్కెట్ కమిటీ సమావేశం చైర్‌పర్సన్ దొంతగాని లక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మఠంపల్లి మార్కెట్ యార్డులో పశువుల మార్కెట్ నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మార్కెట్ యార్డు దుకాణాలను కిరాయికి ఇవ్వాలని, గరిడేపల్లి, హుజూర్‌నగర్ మార్కెట్ యార్డులలో అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, కోదాడ ఏఎంసీ పరిధిలో ఉన్న నోటిఫైడ్ ఏరియాలను హుజూర్‌నగర్ ఏఎంసీ పరిధిలోకి మార్చాలని, ఇంకా పలు అంశాలపై సమావేశంలో ఆమోదించి తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముడెం రామలింగారెడ్డి, ఎంపిక శ్రేణి కార్యదర్శి సంగయ్య, డైరెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామివారి ఊరేగింపు



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న ధర్మకర్తలు, అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో తిరుకల్యాణ అధ్యయనోత్సవాల పూజా కార్యక్రమాలను అర్చకులు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, నిత్యహోమం, సుదర్శన హోమం, పూర్ణాహుతి, బలిహరణ, ఆరగింపు, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీవేణుగోపాలసామి రుక్మిణీ సత్యభామ గోదాదేవి సమేతముగా స్వామివార్లను గజవాహనంతో బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. తదనంతరం నిత్యహోమం, బలిహరణ, పూర్ణాహుతి, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ సలీమారంజాన్, ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురబీ కుషల్, పవన్‌కుమార్, గురవయ్య, రామకృష్ణ, మట్టపల్లి, అంజమ్మ, కిరణ్‌గౌడ్, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, అనంతరచార్యులు, యజ్ఞాచార్యులు, మనోహరచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో రన్ ఫర్ జీసస్ ర్యాలీలు



కోదాడఅర్బన్ : ర్యాలీ ప్రారంభిస్తున్న పాస్టర్ యేసయ్య

హుజూర్‌నగర్ : పట్టణంలో క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభువు దీవెనలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ చైర్మన్ దేవ సహాయం, అధ్యక్షుడు ఉదయ్‌బాబు, మండల అధ్యక్షుడు ఆమోస్, నాయకులు జాషువా, ఫిలిప్, రాజు, దయాకర్, ప్రభుకిరణ్, రవికాంత్, ఏసుబాబు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కోదాడలో..

కోదాడఅర్బన్ : ఈస్టర్ పండుగ సందర్భంగా కోదాడ యునైటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోదాడలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నయానగర్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ యేషయ్య స్థానిక రంగా థియేటర్ సెంటర్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్స్ శ్రావణ్‌కుమార్, కె.జోసెఫ్, అబ్రహం, ప్రభుదాస్, పోలు చారి సందర్‌రావు, రాజారావు, జోసఫ్‌రాజు, ఏసయ్య, శ్రీనివాస్‌గౌడ్, జగ్గునాయక్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు

చిలుకూరు : హైదరాబాద్‌లో ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించబోయే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండా సైదయ్య, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మోలుగూరి నాగరాజు కోరారు. శనివారం చిలుకూరులో జరిగిన ఆ పార్టీ ఎస్సీ సెల్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, నెల్లూరి నాగేశ్వరరావు, చెవ్వుల నాగేశ్వరరావు, వీరబాబు, మురళీ, వెంకటేశ్వర్లు, కుటుంబరావు, వెంకటరమణ, రాజు, రమేష్, రవి పాల్గొన్నారు.

'కిట్స్'లో అంబేద్కర్ జయంతోత్సవాలు

కోదాడఅర్బన్ : ఈ నెల 14న భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు అంబేద్కర్ జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. శనివారం కిట్స్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. కళాశాల అకడమిక్ సలహాదారుడు పోతుగంటి నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో స్థానిక సేవా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సినిమాను వీక్షించారు. కాగా మండలంలోని మాధవరం, కలకోవ గ్రామాలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బలగం సినిమా ప్రదర్శించారు.

నడిగూడెం : మండల పరిధిలోని వేణుగోపాలపురం, కరివిరాల గ్రామాలలో శనివారం అందరి మన్ననలు పొందుతున్న బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. వేణుగోపాలపురంలో సర్పంచ్ గందమళ్ల స్వరూప, కరివిరాలలో సామాజిక కార్యకర్త గార్లపాటి మహేష్‌రెడ్డి సహకారంతో చిత్రాన్ని ప్రదర్శించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సినిమాను వీక్షించారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ నాయకులు

అర్వపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఏపూరి సోమన్న విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడారు. పశ్నపత్రాల లీకేజీపై వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నిరుద్యోగ సమస్యపై తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న ఇసుక దందాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట్ల పరమేష్, శంబయ్యనాయుడు, వెలుగు అంజయ్య, కొమ్ము ఉపేందర్, గాజుల సురేందర్, పి. ఉపేందర్, దిలీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనకు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన



హుజూర్‌నగర్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



కోదాడఅర్బన్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు



గరిడేపల్లిలో..



మునగాల : గణపవరం క్రాస్‌రోడ్డులో..

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం మరిచిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు విమర్శించారు. శనివారం సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీజేపీ హటావో దేశ్‌కి బచావోలో భాగంగా పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల కండువాలతో నిరసన తెలిపి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చింది చేసింది ఏమీ లేదని ఆరోపించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు లాంటి విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణకు కొంగు బంగారమైన బొగ్గు గనులను సింగరేణికి కాకుండా ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు దొంతగాని సత్యనారాయణ, యల్లావుల రమేష్, జక్కుల రమేష్, బాదె నరసయ్య, జక్కుల శ్రీను, కె.బక్కయ్య, బత్తిని మల్లయ్య, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయకుండా మోసం

హుజూర్‌నగర్ : కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని సీపీఎం నాయకులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ వెనక్కి వెళ్లాలని శనివారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగారపు, పాండు, పల్లె వెంకటరెడ్డి దుగ్గి బ్రహ్మం, సైదులు, హుస్సేన్, శ్రీను, యోనా, వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పాల్గొన్నారు.

మునగాల : వందేభారత్ రైలు ప్రారంభోత్సవానికి హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాని మోదీ గో బ్యాక్ అంటూ శనివారం మండల కేంద్రంలోని గణపవరం క్రాస్‌రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, చందా చంద్రయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ సైదా, బచ్చలకూర స్వరాజ్యం, జిల్లేపల్లి శ్రీనివాస శేఖర్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ కోదాడలో శనివారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన మోదీ తెలంగాణలో అభివృద్ధి పేరిట వచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. మోదీ గో బ్యాక్ అంటూ నినదించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు మేకల శ్రీనివాసరావు, లతీఫ్, హనుమంతరావు, ప్రసాద్, రమేష్, సీపీఎం నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బసవయ్య, ముత్యాలు, దాసరి శ్రీనివాస్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను అమలు చేయలేని ప్రధాని నరేంద్రమోదీకి తెలంగాణకు వచ్చే అర్హత లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మోదీ గో బ్యాక్ అంటూ నల్ల బ్యాడ్జీలతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన విశ్వ విద్యాలయం వంటి విభజన అంశాలను కేంద్ర ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేష్, చంద్రయ్య, రామకృష్ణ, పాండు, సైదులు, నాగయ్య తదితరులున్నారు.

తెలంగాణకు అన్యాయం చేస్తున్న మోదీ

నేరేడుచర్ల : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. మోదీ పర్యటనకు వ్యతిరేకంగా శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రధాని మోదీ ఎప్పుడు తెలంగాణకు వచ్చిన ఉత్త చేతులతోనే రావడం తప్ప రాష్ట్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రావుల సత్యం, లక్ష్మి, శ్రీను, భిక్షం, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

హామీలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

నడిగూడెం : ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మోదీ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎస్‌కే.మస్తాన్, అనంతుల కృష్ణయ్య, మల్లేపల్లి కళ్యాణ్, నవీన్, వినోద్, అభిమన్యు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని మోదీ తెలంగాణకు రావడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వట్టెపు సైదులు, జగన్, అశోక్, ఆది, వినోద్, శ్రీను, రాజశేఖర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : తెలంగాణ విభజన హామీలు అమలు చేయడంలో ప్రధాని మోదీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కంబాల శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మఠంపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి మోదీ గో బ్యాక్ అంటూ నినదిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, సీనియర్ నాయకులు దాశరథి రామకృష్ణ, చిన్నజాన్, మట్టయ్య, కోటిరెడ్డి, జాను, తదితరులు ఉన్నారు.



నేరేడుచర్లలో..



నడిగూడెంలో..



మఠంపల్లిలో..

మానవత విలువలతో వ్యక్తిత్వ వికాసం

సూర్యాపేట రూరల్ : మానవత విలువలే వ్యక్తి వికాస విలువలను తెలియజేస్తాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శంకర్‌నాయక్ అన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే అంశంపై ట్రస్ట్ ప్రతినిధి సుమలత సమక్షంలో పుట్టపర్తి సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పై అంశంపై విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. సామాజిక అంశాలపై అవగాహన ఉన్నప్పుడే విద్యార్థులు పరిపూర్ణ వికాసవంతులుగా తయారవుతారని తెలిపారు. సమాజంలోని రుగ్మతులను తొలగించడానికి విద్య ఒక్కటే ఆయుధంగా పని చేస్తుందని అన్నారు. అనంతరం సామర్థ్య పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెమోంటో అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ శంకర్ నాయక్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది చంద్రబాబు, కవిత విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు సుశీలమ్మకు నివాళి

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ స్వర్గీయ గట్టు వెంకట్రామయ్య భార్య సుశీలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం సీపీఎం నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుశీలమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, దేవరం వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, చందా చంద్రయ్య, ములకలపల్లి రాములు, షేక్ సైదా, జిల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రీన్‌వుడ్, కృష్ణవేణి పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యను పూర్తి చేసి ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ సరితమర్రెడ్డి కరస్పాండెంట్ ఏవీ కృష్ణారావు, హెచ్‌ఎం రాజారెడ్డి, మారయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి

మఠంపల్లి : మండలంలోని కామంచికుంటతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడబండతండాలో తాగు నీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తున్నట్లు ఎంపీటీసీ దారావత్ శౌరినాయక్, మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ తెలిపారు. శనివారం బోడబండతండాలోని ముత్యాలమ్మ గుడి వద్ద ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో చేపట్టిన తాగునీటి బోరు డ్రిల్లింగ్ ఏర్పాటును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సైదునాయక్, వార్డు సభ్యులు పత్తూనాయక్‌కోటమ్మ, గ్రామపెద్దలు మంగళానాయక్, బాబు, బోడకా, పల్‌సింగ్, లక్‌పతి, అనిల్, గణేష్, నితిన్, పవన్, బుజ్జి, చాందిబాయి తదితరులున్నారు.

న్యాక్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

సూర్యాపేటటౌన్ : ఇంజనీరింగ్ విద్యార్థులు, యువత తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు జిల్లా కేంద్రంలో న్యాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఇంజనీరింగ్ విద్యార్థులు అన్నారు. సూర్యాపేటలో న్యాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ శనివారం వారు జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు.